


జైలు జీవితం దుర్భరంగా వుంది. కాని ఏమి చెయ్యను! తెలిసో తెలియకో చేశాను. మనకన్న మన నాయకులకు ఎక్కువ విషయాలు తెలుసు అనే గుడ్డి నమ్మకం మీదే చేశాను. జైలులో వున్నాను. యిక్కడి జీవితం యింత దుర్భరంగా వున్నా నాయకుడు ఒకడూ వచ్చి సహాయం చేయడు. కనీసం యిప్పుడు స్వాతంత్ర్యం వచ్చిం తరువాతైనా చెప్పొచ్చుగా. "మన వాడేనయ్యా విడిచిపెట్టండి" అని—చెప్పరేం ?

పాపం, సరళ ఏంచేస్తుందో? నన్నే నమ్ముకొని వున్నానని చెప్పింది. జైలు నుంచి తిరిగిరాగానే పెండ్లాడతానని చెప్పాను. అంటే అప్పుడు ఏ సంవత్సరమో లేక రెండు సంవత్సరాలో వేస్తారనుకున్నాను. కాని యిలా ఏ సంగతీ చెప్పకుండా 10 సంవత్సరాల నుంచీ వుంచేస్తారనుకో లేదు.

నాకే 36 సంవత్సరములు అయిపోయాయి. సరళకు కనీసం 30 ఐనా వుంటాయి. ఇంతకాలం ఎంతటి ఏకాంత జీవితం గడుపుతుందో—నా కోసం—ఎన్నికలలు కంటుందో? పాపం మల్లెపూవులంటే చాల యిష్టపడేది. మా తోటలోనుంచి ఎన్నో స్వయంగాకోసి తీసుకెళ్లేవాడ్ని. ఇప్పుడు ఆ తోటను ఎవరు చూస్తున్నారో! పువ్వులు ఎవరు తీసుకెళ్ళి యిస్తున్నారో—ఛీఛీ—ఎవరో యివ్వడ మేమిటి; నా సరళకు నేను గాక ఇంకొకరు పువ్వులు తీసికెళ్ళి యివ్వడమా! అసంభవం.

అది 1942వ సంవత్సరం. బి. యస్. సి. చదువుకుంటున్నాను. సరళ నేనూ నా పదవ ఏట నుంచీ స్నేహితులమే! మా యిద్దరిలోనూ ఎటువంటి అరమరికలు వుండేవి కావు. యుక్త వయస్సు వచ్చిం తరువాత కూడ అలాగే వుండే వాళ్లం. నా మేనత్త కూతుళ్ళు అందరూ అందగత్తెలే! కాని వారందరితోనూ సరి చూస్తే నా సరళ మాత్రం కాస్త తక్కువే అని చెప్పాలి! పైగా పాదం కాస్త మడతపడి పుట్టింది—'కుంటిపిల్ల' యిదీ ప్రపంచం నా సరళకు పెట్టిన పేరు. పాపం చాలా కాంప్లెక్సుతో బ్రతికేది. అందుకే కాబోలు నాకు అదంటే అమితమైన ప్రేమ.

వేసవి పున్నమి. మల్లెపొద మాటున ఏకాంతంగా భావగీతాలు నాలో నేనే కూని రాగాలు తీస్తు

యస్. వి. రంగారావు



న్నాను,—ఏదో అలికిడి.—తెల్లని చీర—అప్సరస నాట్యభంగిమం—ఆహా! ఎన్నో హొయలు తీర్చిన భంగిమ మది. కలలో కూడ గనలేని, కవులకుకూడ అందని భంగిమ మది. నా సరళ ప్రశాంతంగా, అతి మనోహరంగా, నా వద్దకు వచ్చింది-ఎవరు చెప్పారు నేనిక్కడున్నానని! నాకే తెలియదే నేనిక్కడుంటానని. ఎలా వచ్చింది—దైవ సంకల్పం అంటారు మనుషులు- ఇక్కడకు కూడా రావాలా భగవంతుడు—అదే నా కడసారి కౌగలింత—పులకరించిన మేనితో గడుపుతున్నాను జీవితం. "సరళా! జ్ఞాపకమున్నానా నీకు ?—"

అది 1952 సంవత్సరము. చిక్కిశల్యమై యింకా బ్రతుకుతున్న నా శరీరానికి విడుదల—పాపం చాలా కష్టపడి ఏర్పాటు చేశారు

మా రెడ్డిగారు. ఇన్ని సంవత్సరాల కాలం మరిచిపోగలిగిన నన్ను యిప్పుడెలా జ్ఞాపకం చేసుకున్నారో నాకర్థం కాలేదు.—

జైలు బయట వాతావరణం అతి దుర్భరంగా వుంది. మనదేశంలోకూడా ఇంతచల్లగా వుంటుందని నే నెన్నడూ అనుకోలేదు — "అదెవరు" వార్డెన్ వస్తున్నాడు. అయ్యో బాబో కొడ్తాడేమో—నేను లోపలికి వెళ్లిపోవాలి— అయ్యో తలుపులు వేసేశారే!

"రావుగారు", యింకా ఏమిటి ఆలోచిస్తున్నారు? ఎందుకయ్యా యింకా యీ కాంపౌండులో మీరు! దయచేసి బయటికి పొండి. ఇంకొక గంటసేపు లోపల వున్నారంటే 'లా'— మీ మీద యింకో నేరం రుజువు చెయ్యగలదు. త్వరగా పారిపొండి."

"థ్యాంక్యు బ్రదర్ - వెళ్తున్నాను."

యిదేమిటి—ఈ రోడ్లమీద నేను నడవనా! నడవగలనా! ఎవరన్నా చూస్తే? చూస్తే ఏం? నన్ను పట్టుకుంటారా? నేను విడుదల అయ్యానుగా"—

తిరుగుతున్నాను రోడ్ల వెంబడి కొత్తగా వచ్చిన స్వాతంత్ర్యాన్ని భుజాన్న వేసుకొని—జైలు జీవితమే దుర్భరమనుకున్న నాకు, ఈ సరికొత్త స్వాతంత్ర్యం మరీ దుర్భర మనిపించింది—అయ్యో! నా సరళను అసలే మర్చిపోయాను. వెంటనే వెళ్లి ఆవిడకు నా విడుదలసంగతి చెప్పాలి. మళ్ళీ మల్లిపొద దగ్గిర—వెన్నెల్లో కూర్చొని—నా అప్సరసను తనివితీరా అవలోకించాలి.—

రాత్రి పదిగంటలకు చేరింది ఏలూరు రైలు. దారిన నడుస్తున్నాను. నా బాగామాసిన గడ్డం చూసి కాబోలు మొరుగుతున్నాయి కుక్కలు, నా మనోవేదన వాటికేమి తెలుసు పాపం.—

"అత్తయ్యా! అత్తయ్యా!" తలుపుతట్టాను, అదేమిటి ఇంత ముసిలిదయి పోయిందేమిటి అత్త—"ఎవరయ్యా నువ్వు," అని, దబాయించింది మా మేనత్త—"నేనేనత్తా" అన్నాను— "అయ్యో! నువ్వా నాయనా, రా! లోపలకురా," అని ఆహ్వానించింది ప్రేమతో— "ఎంతగా మారిపోయావు నాయనా! ఔను. నువ్వు చచ్చిపోయావని చెప్పారే?"



"నేను చచ్చిపోవడమా ? ఎప్పుడత్తా ?"

"అయ్యో ఎనిమిది సంవత్సరాల క్రితమే, మాకు తెలియచేశారు నాయనా గవర్నమెంటువారు"

"లే దత్తా నేను యింకా బ్రతికే వున్నాను. కాని సరళ ఎక్కడ ?"

"యింకెక్కడ సరళ నాయనా ? అంతా అయిపోయింది." అంది మా అత్త కళ్ళంట నీరు కారుస్తూ

"అదేమిటత్తా !"

"అవును నాయనా! మీ క్లాస్ మేట్ అట. సవరాల మోహనరావు వచ్చి ఎంతో ఆప్యాయంగా అడిగాడు. సరే నన్నాము. తీరా పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక ఆ స్తంతా తన పేరన వ్రాస్తేనేగాని చేసుకోనన్నాడు. ఎలాగయినా, దానికి చెందవలసిందే గదా అని, సరేనని పెండ్లి చేశాం బాబూ-మూడు నెలలన్నా సుఖజీవితం గడిపిందో లేదో అనుకోకుండా ఒక రాత్రి యింటికి వచ్చేసింది బాబూ— మాతో ఏమీ చెప్పేది కాదు—ఎంత సేపూ తనలో తాను ఏడుస్తూ వుండేది— తిండికూడా సరిగా తినేది కాదు—ఒక రాత్రి గట్టిగా కేక పెట్టింది—దగ్గిరకు వెళ్ళి చూచేటప్పటికి కళ్ళు తేలవేసి, కాళ్ళూ చేతులూ తన్నుకుంటుంది. డాక్టరుకు కబురు పంపించాం — అతను వచ్చేలోగానే అంతా అయిపోయింది నాయనా! పాపిష్టి ముండా వాడు ఏమిబాధలు పెట్టాడో ఏమో—తనభర్తకు పనికిరాని తను జీవించటం మంచిది కాదంటూ ఉత్తరం ముక్కరాసి మరీ చచ్చిపోయింది— —

"కడుపులో చెయ్యేసి కలిపేసి"— నందూరి—జ్ఞాపక మొచ్చాడు.

నా విడుదలతో దొరికిన స్వాతంత్ర్య అంధకారంలో నాకు కనిపించిన ఒకే ఒక వెలుగు నా సరళ—ఆమెకూడా లేదా ఈనాడు ?

ఎక్కడిదా మల్లెపూలవాసన— ఓహో అర్థమయింది—"తెలుసుకున్నాను. సరళా ! యిదిగో యిప్పుడే వెడుతున్నాను.

మోహనరావు హాయిగా, నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ప్రక్కన అతని వుంపుడుకత్తె పడుకొనుంది. వణుకుతున్న చేతితో ధైర్యంగా పొడిచాను అతని రొమ్ముమీద—రక్తం నా మొహాన్ని చిందింది.——

"మరణ దండన విధించటమైనది." అని జడ్జిగారి తీర్పు——

అబ్బ! పొరపాటున ఎదైనా రాంగ్ సెక్షన్ జ్ఞాపకమొచ్చి యావజ్జీవ కారాగారశిక్ష వేస్తాడేమోనని భయపడ్డాను —పోనీలే స్వాతంత్ర్యం చవి చూడలేని నా జీవితానికి చక్కటి విడుదల దొరికింది.

